క్లుప్తంగా

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు



బరక సంజీవరాయ స్వామి మూలవిరాట్

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన బరక సంజీవరాయ స్వామి ఆలయ 14వ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, 11.45 నిముషాలకు సీతారాముల కళ్యాణం, పల్లకీ సేవ, సాయంత్రం రథోత్సవం ఉంటుందని వెల్లడించారు. ఈ వేడుకలకు అశేష జనవాహిణి పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే వివిధ కేటగిరీలలో రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై నిర్లక్ష్యం తగదు

నందికొట్కూరు: మహాశివరాత్రి పండుగ ఏర్పాట్లపై ఎండోమెంట్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి లాజరస్ ఆరోపించారు. గురువారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో ముక్కంటి శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, చెన్నకేశవ దేవాలయాలను ఎంసీపీఐ(యూ) బృందం దర్శించి ఎండోమెంట్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.వారు మాట్లాడుతూ.. మల్యాలలో దేవాలయాలకు వంద ఎకరాల భూమి ఉన్నా ఎండోమెంట్ అధికారులు కన్నెత్తి చూడటం లేదన్నారు. మహాశివరాత్రి పండుగ సమీపిస్తుండడంతో ఏర్పాట్లపై గ్రామ ప్రజలతో చర్చించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయ భూములను వేలం వేసి లక్షల రూపాయలను దోచుకుంటున్న అధికారులపై జిల్లాస్థాయి అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

పగిడ్యాల: 2025–26 విద్యా సంవత్సరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని లక్ష్మాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ సూచించారు. ఆమె గురువారం ఓ ప్రకటనలో తెలుపుతూ.. ఆంగ్ల మాధ్యమంలో నిర్వహించే ఈ పాఠశాలలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు వచ్చే 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సూపర్ సిక్స్‌ను విస్మరించడం సిగ్గుచేటు

పగిడ్యాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఎంసీపీఐ (యు) డివిజన్ నాయకులు మద్రిస్వామి ధ్వజమెత్తారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తహసీల్దార్ శివరాముడుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెన్నుపోటుదారుడని మరోసారి రుజువైందని ఎద్దేవా చేశారు. పదవి వ్యామోహంతో గతంలో పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచి టీడీపీని, ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందేనని గుర్తు చేశారు. అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించిన చంద్రబాబు అధికారం వచ్చాక వాటిని చూస్తేనే భయమేస్తోందని, అమలు చేయలేకపోతున్నామని అసెంబ్లీ సాక్షిగా చెప్పి తన నైజాన్ని చాటుకున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే వరకు ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. నాయకులు శ్రీనివాసులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు గ్రామంలో చిన్న అక్బర్ (52) అనే వ్యక్తి గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, రమణారెడ్డి, సాంబ,అంజి, రాజేష్, దర్గయ్య, శ్రీను, బాలు, వడ్డెశంకర్, వడ్డెనాగేషులు మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల నగదును అతని కుటుంబసభ్యులకు అందించి మానవత్వం చాటుకొన్నారు.

విజయవంతం చేయండి

పాములపాడు: ఈ నెల 23న కర్నూలులో నిర్వహించే రాయలసీమ మాలల యుద్ధ గర్జనకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు అంకన్న, కేవీపీఎస్ మండల కార్యదర్శి మేకల రాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఎస్టీబీసీ మైదానంలో భారీ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాయలసీమ జిల్లాల నుంచి మాలలందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం నాయకులు బాలస్వామి, తిమ్మయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని పంటల ధ్వంసం



లారీ, ట్రాక్టర్ వెళ్లడంతో దెబ్బతిన్న కంది పంట



వాహనాలు తిరగటం, స్తంభాలను వేయడంతో దెబ్బతిన్న పంట



పనులను అడ్డుకుంటున్న రైతులు

జూపాడుబంగ్లా: రెక్కలు ముక్కలు చేసుకొని ఆరుగాలం కష్టించి పండించిన కంది, మినుము పంటలు మరో వారం రోజుల్లో చేతికొస్తాయనుకొన్న సమయంలో పవర్‌గ్రిడ్ కాంట్రాక్టర్ పొలంలో వాహనాలు తిప్పి నాశనం చేయటంతో రైతులు లబోదిబోమంటున్నారు. వివరాలు.. మండలంలోని పి.లింగాపురం గ్రామానికి చెందిన నాగస్వామి, సూర్యభగవాన్‌రెడ్డి, శివకృష్ణారెడ్డి, బాలపుల్లయ్య పొలాల్లో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వారు హైటెన్షన్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం పొలాల్లో ఐదు సెంట్ల చొప్పున స్థలాన్ని సేకరించుకొని నష్ట పరిహారంగా రూ.3.15 లక్షలు చొప్పున చెల్లించారు. అయితే దిగుబడి చేతికొచ్చే సమయంలో పనులు ప్రారంభించి పొలాల్లో ఇష్టానుసారంగా లారీలు, ట్రాక్టర్లు తిప్పి పంటనంతా నాశనం చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వారం రోజుల్లో దిగుబడులను నూర్పిడి చేసుకున్న తర్వాత టవర్ల నిర్మాణం పనులు ప్రారంభించుకోవాలని కోరినా లెక్కచేయలేదని వాపోతున్నారు. ఇష్టానుసారంగా వాహనాలు తిప్పడంతో నాగస్వామికి చెందిన 1.50 ఎకరాల్లో కందిపంట దెబ్బతినగా రూ.2 లక్షల నష్టం, సూర్యభగవాన్‌రెడ్డి, శివకృష్ణారెడ్డి, బాలపుల్లయ్యకు చెందిన మినుము, కంది పొలాలు దెబ్బతినడంతో ఒక్కొక్కరికి రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లెదుటే పంటను నాశనం చేస్తుంటే తట్టుకోలేని రైతులు బుధవారం పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించినా కాంట్రాక్టరు ఏమాత్రం ఖాతరు చేయకుండా పనులను కొనసాగించారు.

ఆలయంలో నాగుపాము



సుపథం మండపంలో కనిపించిన నాగుపాము

మహానంది: మహానంది ఆలయ రాజగోపురం ముందు ఉన్న సుపథం మండపంలో గురువారం రాత్రి నాగుపాము కనిపించింది. ఈ మండపంలో భక్తులు సేద తీరుతుంటారు. గురువారం అక్కడ నాగుపాము కనిపించడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. స్థానిక అయ్యన్ననగర్‌కు చెందిన స్నేక్‌క్యాచర్ మోహన్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి పామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశారు.

దత్తాత్రేయుడికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి గురువారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.



శివపార్వతుల విగ్రహాలు

ముస్తాబవుతున్న మహానంది

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది ఆలయం ముస్తాబవుతుంది. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలోని కోనేరుల ముందు ఉన్న పార్వతీ, పరమేశ్వరుల విగ్రహాలతో పాటు రాజగోపురం మండపంలోని శివపార్వతుల కుటుంబ పరివార విగ్రహం, అమ్మవారు, రాజగోపురంపై ఉన్న ఈశ్వరుడి దంపతుల విగ్రహాలకు నూతన రంగులు వేస్తున్నారు. ఇప్పటికే పెయింటింగ్ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. గురువారం ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి క్షేత్ర ప్రాంగణంలో పర్యటించి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. – మహానంది



రంగులతో ఆకట్టుకుంటున్న నీలకంఠుడు



కొత్తగా కనిపిస్తున్న పార్వతీదేవి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

జూపాడుబంగ్లా: రకరకాల పన్నాగాలతో ప్రజలను మోసం చేస్తున్న సైబర్ నేరస్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. గురువారం మండలంలోని తరిగోపులలో గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామాంజినాయక్, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సైబర్ నేరస్తులు ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తాం ఆధార్, బ్యాంకు నెంబర్లు చెప్పాలని, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాం మీకు పాన్‌కార్డు, క్రెడిట్‌కార్డు ఇస్తామంటూ నమ్మబలికి బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నంబర్ వివరాలు తెలుసుకొని ఖాతాల్లోని డబ్బులను మాయం చేస్తారని వివరించారు. అలాగే మీ అమ్మాయి, అబ్బాయి కేసుల్లో ఇరుక్కున్నారు. త్వరగా డబ్బులు పంపిస్తే రక్షిస్తామంటూ నమ్మబలికి నేరాలకు పాల్పడుతుంటారని చెప్పారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు తొందరపడి లిఫ్ట్ చేయటం, మిస్డ్ కాల్ వస్తే తిరిగి కాల్ చేయడం వంటివి చేయవద్దని సూచించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ఆటోడ్రైవర్లు లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవటం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్పా తొందరపడి ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. అలాగే భార్యభర్తలు, కుటుంబ సభ్యుల మధ్య నెలకొనే చిన్న చిన్న సమస్యల వల్ల మనస్తాపానికిలోనై ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని శాంతియుతంగా జీవించటం అలవర్చుకోవాలన్నారు. సర్పంచ్ అంజనమ్మ, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, గిరీశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, నాగార్జునరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా: డ్రైవర్ ఉద్యోగం నిత్యం కత్తి మీద సాము లాంటిదని జూపాడబంగ్లా ఎస్‌ఐ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం జాతీయ డ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జూపాడుబంగ్లా వైఎస్సార్ విగ్రహం వద్ద ది రాష్ట్రీయ చలక్‌ఏక్తా మంచ్ ట్రేడ్ యూనియన్ అధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఖాకీ యూనిఫారం రక్షణకవచం లాంటిదన్నారు. వాహనం డ్రైవర్లు యూనిఫారం ధరించటంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. డ్రైవర్ ఉద్యోగం నిత్యం ప్రాణాపాయంతో కూడుకొన్నది గనుక ఇంట్లో కుటుంబసభ్యులు, వాహనాల్లోని ప్రయాణికులు, తన ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ నిర్ణీత వేగంతో వాహనాన్ని నడుపుతూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలన్నారు. అలాగే దురలవాట్లకు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అనంతరం ఎస్‌ఐను డ్రైవర్లు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. నంద్యాల జిల్లా కమిటీ అధ్యక్షుడు ఖాజా, ఉపాధ్యక్షుడు దేవవరం, సెక్రటరీ షేక్ చాంద్‌బాషా, డ్రైవర్లు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా మహానంది ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన గురువారం ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని విగ్రహాలకు నూతన రంగులు వేస్తున్నట్లు చెప్పారు. పెయింటింగ్ పనులు దాదాపు పూర్తి దశకు చేరుకున్నాయని, పెద్ద నంది విగ్రహానికి రంగులు వేయడం పూర్తైందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేపడతామన్నారు. క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి ఇంజినీరింగ్, పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

మిడుతూరు: ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా చదివి పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రత్యేకాధికారి బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్ సూచించారు. గురువారం స్థానిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నైతిక విలువలతో కూడిన విద్యతో పాటు పదో తరగతిలో సబ్జెక్టుల వారీగా ప్రణాళిక ఏర్పాటు చేసుకొని చదువుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి అందించిన జామెంట్రీ బాక్స్, నోటు పుస్తకం, పెన్ను, పెన్సిల్ తదితర విద్యా సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ దశరథరామయ్య, వార్డెన్ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజారావు, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. కలెక్టర్ రాజకుమారి గణియా సహకారంతో విద్యార్థులకు మంజూరు చేసిన పరీక్షా కిట్లను వారు గురువారం పంపిణీ చేశారు.

రుణాల మంజూరు, రికవరీలో మొదటిస్థానం

వెలుగోడు: స్త్రీనిధి రుణాల మంజూరు, రికవరీలో గుంతకందాల గ్రామం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. ఆ గ్రామానికి చెందిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ మద్దెల పుల్లయ్య మదర్ థెరిసా సంఘం 2023–2024–2025 సంవత్సరాలకు సంబంధించి ఇప్పటివరకు రూ.2.35 కోట్ల స్త్రీనిధి రుణాలను పొదుపు మహిళలకు పంపిణీ చేశారు. అలాగే రికవరీ కూడా నూరు శాతం వసూలు చేసి జిల్లాలో మద్దెల పుల్లయ్య మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మద్దెల పుల్లయ్యను ఈనెల 5వ తేదీన నంద్యాలలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఎండీ జీవీబీడీ హరిప్రసాద్ పంపిన బహుమతిని పుల్లయ్యకు అందజేశారు. స్థానిక పొదుపు మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం వీఓఏ మద్దెల పుల్లయ్యను ఏపీఎం పుల్లయ్య, సీసీలు, వీఓఏలు అభినందించారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు



గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్‌ఎంపీ

పాములపాడు: మండలంలోని బానుముక్కల మలుపు సమీపంలో కర్నూలు – గుంటూరు ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దకడబూరు మండలం, గట్టిగట్లు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, తమ్ముడి కుమారుడు నరసింహారెడ్డి గుంటూరుకు పని కోసం వలస వెళ్లారు. ఈ ఇద్దరు గురువారం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. మండలంలోని యర్రగూడూరు గ్రామానికి చెందిన చింతల సుధీర్ ఆత్మకూరు వైపు వెళ్తుండగా బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రోడ్డుపై పడిన ముగ్గురు గాయాలపాలయ్యారు. అటుగా వెళ్తున్న ఆర్‌ఎంపీ మహ్మద్‌ఖాసిం క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేశారు. ఎస్‌ఐ సురేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు.

'గుండెకు భరోసా' పోస్టర్ విడుదల



గుండెకు భరోసా పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

మిడుతూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెకు భరోసా పోస్టర్‌ను వైద్యాధికారి డాక్టర్ తిరుపతి గురువారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గుండెపోటు వస్తే తక్షణమే దగ్గర్లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ గుండెపోటును నివారించే టెనెక్టాప్లస్ అనే రూ.45 వేలు విలువగల ఇంజెక్షన్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ ఇంజెక్షన్ చేస్తే గుండెపోటు నుంచి తక్షణ ఉపశమనం కలుగుతుందని వివరించారు. ఎంపీడీఓ దశరాథరామయ్య, డాక్టర్లు భరత్, శారద, సాయిసుధ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంఏజీవైకి ఎంపికైన అబ్దుల్లాపురం

వెలుగోడు: మండల పరిధిలోని అబ్దులాపురం గ్రామ పంచాయతీ ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ్ యోజన పథకం కింద ఎంపికైందని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఫేజ్ –2లో పీఎంఏజీవై కింద ఎంపిక కావడంతో ఎస్సీ కాలనీలలో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసేందుకు సర్వే చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అలాగే తాగునీరు, అభివద్ధి కార్యక్రమాలకు రూ.20 లక్షలు ఖర్చు చేయనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు.

స్వచ్ఛతా కార్యక్రమం



పారిశుద్ధ్య పనులు చేస్తున్న దేవస్థాన సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర పరిధిలోని పలు ప్రాంతాలలో ఆలయ అధికారులు, సిబ్బంది గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ముందుగా రథశాల నుంచి పెద్దసత్రం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రసాద విక్రయ కేంద్రం, ఆలయ మాడ వీధులు, క్యూకాంప్లెక్స్, సాక్షి గణపతి ఆలయం, హఠకేశ్వరం, శిఖరేశ్వరం తదితర చోట్ల పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈఓ ఎం.శ్రీనివాసరావు, ఈఈ నరసింహారెడ్డి, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

కొత్తపల్లి: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత సూచించారు. గురువారం మండలంలోని దుద్యాల గ్రామ పొలాల్లో ఏఓ మహేష్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పాడి పంటలు, వాటి వివరాలు, సాగు పద్ధతుల గురించి తెలుసుకొనేందుకు రైతులు రూ.300 చెల్లించి ప్రతి నెలా మాస పత్రికను పొందాలని సూచించారు. కందులు సాగుచేసిన రైతులు మద్దతు ధరకు విక్రయించేందుకు రైతు సేవాకేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.వీఆర్వో లింగస్వామి పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

మిడుతూరు: బీసీ కులస్తులకు సంబంధించిన రుణాలకు శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతూ అర్హులైనవారు స్వయం సహాయక రుణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చిన్న తరహా పరిశ్రమలు,వ్యాపారాలు, రవాణా విభాగం తదితర యూనిట్లకుసబ్సిడీపై రుణాలు అందించనున్నట్లు చెప్పారు.

నాలుగు వాహనాలు సీజ్

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రం సున్నిపెంటలో గురువారం సాయంత్రం టూటౌన్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అంబేడ్కర్ సెంటర్‌లో తనిఖీ చేపట్టి ఎటువంటి పత్రాలులేని నాలుగు వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ బీవీ సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే త్రిబుల్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ చేస్తూ మొదటిసారిగా పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని, ఇకపై ఎవరైనా నిబంధనలు అతిక్రయించి పట్టుబడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొలనుభారతి క్షేత్రంలో భీష్మ ఏకాదశి వేడుకలు



కొలనుభారతి దేవికి మంగళహారతి ఇస్తున్న శివయోగేంద్ర సరస్వతి

కొత్తపల్లి: సరస్వతీ క్షేత్రమైన కొలనుభారతీ దేవి ఆలయంలో నిర్వహించే 66వ భీష్మ ఏకాదశిని విజయవంతం చేయాలని కాకనూరు శారదా పీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి పిలుపునిచ్చారు. ఆయన గురువారం కొలనుభారతీ దేవి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన సరస్వతీదేవికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఏటా మాదిరిగానే ఈనెల 9, 10 తేదీల్లో కాకనూరు శారద పీఠం వ్యవస్థాపకుడు సద్గురు సరస్వతి నారాయణస్వామి ఆశీస్సులతో కొలనుభారతిదేవి ఆలయంలో భీష్మ ఏకాదశిని నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న నాగరాజారావు

జూపాడబంగ్లా: మండలస్థాయి అధికారులు నిక్కచ్చిగా పనిచేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారంలో శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారి, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజారావు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. పింఛన్ల తనిఖీ పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, ఉపాధి హామీ పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలన్నారు. వివిధ శాఖల మండలాధికారులు పాల్గొన్నారు.

అలరించిన హరికథ



హరికథాగానం వినిపిస్తున్న కళాకారిణి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన డి.లక్ష్మీ మహేష్ భాగవతారిణి వారిచే శివపార్వతుల కల్యాణంపై హరికథాగానం నిర్వహించారు. హార్మోనియం ఎం.ధనుంజయ, మృదంగ సహకారం ఎం.వెంకటేష్ అందించారు.

ఓటీఎస్ ద్వారా రుణవిముక్తి

కొత్తపల్లి: స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న మొండి బకాయిలకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా రుణ విముక్తి కల్పించనున్నట్లు మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక బ్యాంకులో వారు మాట్లాడుతూ.. బ్యాంకులో వ్యవసాయ రుణాలు పొంది తిరిగి చెల్లించని వారు వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా నగదు చెల్లిస్తే 15 నుంచి 75 శాతం వరకు అసలు, వడ్డీలో రాయితీ కల్పించనున్నట్లు చెప్పారు. మండలంలో 283 ఖాతాల నుంచి రూ.1.36 కోట్లు బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు. వీరంతా మార్చి 31వ తేదీలోపు రుణ సమాధాన్ పథకం కింద నగదు చెల్లించి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫీల్డ్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, క్యాష్ ఇన్‌చార్జ్ రాజశేఖర్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఆత్మకూరు: మండలంలోని కొట్టాల చెరువు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని స్కూల్ విద్యార్థులతో ర్యాలీ చేపట్టి ప్రకృతి వ్యవసాయం, పెరటి తోటల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ నాగలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ విభాగం నుంచి ఎస్‌ఆర్‌పీ నరేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు సన్మానం

ఆత్మకూరు: ఈ యేడాది జనవరి 7, 8, 9 తేదీల్లో ఆత్మకూరు ఇస్తేమా ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో విజయవంతమయ్యిందని ఇస్తెమా కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆత్మకూరులో ఆర్డీఓ నాగజ్యోతిని శాలువా, మొమెంటోతో సభ్యులు సత్కరించారు. ఇస్తేమా విజయవంతం అయ్యేందుకు సహకరించిన ఆర్డీఓకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇస్తేమా కమిటీ సభ్యులు హబిబుల్లా, నూర్‌బేగ్, ఇంజనీర్ ఇషాక్, షాలి పహిల్వాన్, మతపెద్దలు ఉన్నారు.

వైద్యులకు అవగాహన సదస్సు

ఆత్మకూరు: ఆర్‌ఎంపీ అండ్ పీఎంపీ ఆత్మకూరు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓమ్నీ హాస్పిటల్ సమక్షంలో గురువారం చక్రం హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. వైద్యులు ఇందూ ప్రకాష్‌రెడ్డి, ప్రదీప్, నిరంజన్ వైరల్ ఫీవర్స్, డెంగ్యూ, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఓమ్నీ హాస్పిటల్ పీఆర్‌ఓ విజయ్ ఆర్‌ఎంపీలకు ముఖ్యమైన విషయాలు తెలియజేశారు. అనంతరం వైద్యులను ఆర్‌ఎంపీ అండ్ పీఎంపీలు శాలువా, పూలమాలలతో సన్మానించారు.